# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 242 | పేజీలు: 4 | వెల: రూ.4/- | బుధవారం 29 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


### ఆదర్శ నగరాలతో పోటీపడేలా
# ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలి: సీఎం

**ప్రజాప్రతినిధులు ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి**

**జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చర్యలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో అక్కడి ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, కార్పొరేటర్లు ప్రభుత్వానికి సహకరిస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం జరిగితే ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల ప్రజాప్రతినిధులకు పాస్ పంపాలని పోలీసులకు సూచించారు.

గ్రామాల్లో సభలు పెట్టండి : కొంతమంది తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారని, ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి కలెక్టర్, మంత్రికి పంపాలని తెలిపారు. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతామని, ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

జూన్ 2లోగా పూర్తి కావాలి : నాలుగో నగరంగా ఫ్యూచర్‌సిటీని తీర్చిదిద్దాలనుకుంటున్నామని, ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీకి వచ్చే పెట్టుబడుల ఒప్పందాలు ఇక్కడే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన గ్లోబల్ సమిట్ ద్వారా ప్రపంచానికి విశ్వాసం కలిగిందన్న సీఎం సైబరాబాద్, హైటెక్ సిటీ, ఓఆర్ఆర్, విమానాశ్రయ నిర్మాణం మన కళ్ల ముందే అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. అభివృద్ధి ప్రాంతాలుగా తీర్చిదిద్దిన ఆనాటి నాయకులను కొంతమంది అవహేళన చేశారని అన్నారు.అద్భుతమైన నగరానికి పునాదులు : దేశంలో ఏ నగరానికి ..మిగతా 2లో



### తెలంగాణ డీజీపీగా
# సీవీ ఆనంద్

**డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న శివధర్‌రెడ్డి**

**1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్**

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి బదిలీ అయ్యారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో సేవలు అందించారు. ఇటీవలే యూపీఎస్సీ డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను తెలంగాణ ప్రభుత్వానికి పంపించిన సంగతి తెలిసిందే. అందులో సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యమిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో అత్యంత సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను డీజీపీగా ప్రభుత్వం నియమించింది.

క్రమశిక్షణకు మారుపేరు : రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ సమీపంలోని కుంట్లూరు గ్రామంలో ఒక మధ్యతరగతి ..మిగతా 2లో

# నేడు బెంగాల్లో రెండోదశ పోలింగ్

**భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం**

**ఎన్ఐఎను అప్రమత్తం చేసిన ఇసి**

**కోల్‌కతా,ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**



పశ్చిమ బెంగాల్‌లో బుధవారం జరగనున్న రెండో దశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా భద్రతను మోహరించింది. రాష్ట్రంలో మొత్తం 294 శాసనసభ స్థానాలకు గాను 152 చోట్ల తొలి దశలో ఈ నెల 23న పోలింగ్ పూర్తయ్యింది. మిగిలిన 142 స్థానాల్లో బుధవారం రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ 142 స్థానాల్లో గత ఎన్నికల్లో టీఎంసీనే 123 చోట్ల విజయం సాధించగా.. భాజపా 18, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ ఒకచోట గెలిచాయి. అయితే, పోలింగ్‌కు కొన్ని రోజుల ..మిగతా 2లో

# అభివృద్ధితో జూపార్కుకు కొత్త వన్నె



**మంత్రి కొండా సురేఖా**

**నెహ్రూ జూలో 'విహార్ ఫుడ్ కోర్ట్'తో పాటు ప్రైమేట్స్, ఫీసెంట్,**

**సారస్ క్రేన్ల నూతన ఆవాస, ప్రదర్శన, సంతానోత్పత్తి కేంద్రాలను ప్రారంభించిన మంత్రి.**

**హైదరాబాద్, ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**

గడిచిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్కులో కొత్త వన్నెను తీసుకువచ్చాయని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖా తెలిపారు. వన్య ప్రాణుల ఆలన , పాలనతో పాటు సందర్శకుల కోసం ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చామని మంత్రి చెప్పారు. మంగళవారం మంత్రి కొండా సురేఖ జూ ప్రధాన ద్వారం వద్ద కొత్తగా నిర్మించిన 'విహార్ ఫుడ్ కోర్ట్' , ప్రైమేట్స్, ఫీసెంట్, సారస్ క్రేన్ల నూతన ఆవాస, ప్రదర్శన, సంతానోత్పత్తి కేంద్రాలతో పాటు స్కానింగ్ మిషన్ ను అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, రాష్ట్ర అటవీ శాఖ అధిపతి డాక్టర్ సి. సువర్ణ, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ వినయ్ కుమార్ తదితరులతో కలసి ప్రారంభించారు. అలాగే కొత్తగా జన్మించిన రెండు ఆఫ్రికన్ సింహపు పిల్లలకు అవని (ఆడ), ఇరా (ఆడ) అని, రాయల్ బెంగాల్ పులి పిల్లలలో ఒక మగ (ఇషాన్), ఒక ఆడ (వాన్య) ..మిగతా 2లో

# అమ్రాబాద్ పునరావాసానికి ఊతం



**మౌలిక సదుపాయాలకు గ్రీన్ సిగ్నల్**

- మంత్రి కొండా సురేఖా అధ్యక్షతన జరిగిన వన్యప్రాణి మండలి స్టాండింగ్ కమిటీ తొలి సమావేశంలో నిర్ణయం.
- నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాల్లో 160 కుటుంబాలు ప్రత్యక్ష నగదు పరిహారం, 257 కుటుంబాలు పునరావాస ప్యాకేజీలు.
- ఏటూరునాగారం వన్యప్రాణి అభయారణ్యంలో రెండు రహదారి ప్రాజెక్టులకు కమిటీ సిఫార్సు.
- డిండి బాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అటవీ భూమి వినియోగానికి అనుమతి
- కవాల్ టైగర్ రిజర్వ్, ప్రాణహిత వన్యప్రాణి అభయారణ్యం ప్రాంతాల్లో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ప్రతిపాదనలకు కూడా స్టాండింగ్ కమిటీ ఆమోదం.

**హైదరాబాద్, ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ప్రాంతం నుంచి పలు కుటుంబాలను గ్రామాలకు తరలిస్తూ పునరావాసం కల్పించడంతో అక్కడి నివాసితులు స్వచ్ఛందంగా తరలిపోవడాని ముందుకు రావడం ప్రభుత్వానికి సంతృప్తి కరమైన అంశమని అటవీ,పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖా అన్నారు. టైగర్ రిజర్వ్ కోర్ నుంచి నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాల్లో 160 కుటుంబాలు ప్రత్యక్ష నగదు పరిహారం ఎంపిక చేసుకోగా, 257 కుటుంబాలు పునరావాస ప్యాకేజీకి అంగీకరించాయి, నగదు పరిహారం ఎంచుకున్న కుటుంబాలకు ఇప్పటికే జాయింట్ బ్యాంక్ ఖాతాలు తెరిచి, ఒక్కొక్క కుటుంబానికి రూ.15 లక్షలు జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. మంగళవారం నెహ్రూ జూలాజికల్ పార్కులో రాష్ట్ర వన్యప్రాణి మండలి స్టాండింగ్ కమిటీ తొలి ..మిగతా 2లో



### దేశవ్యాప్తంగా
# కొరతపై పుకార్లు

**ఖండించిన కేంద్రం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

నేడు బెంగాల్ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారంటూ వస్తున్న పుకరాలను కేంద్రం తోసిపుచ్చింది. అయితే అలాంటిదేమీ లేదని వినియోగదారులకు హామీ ఇచ్చింది. పశ్చిమబెంగాల్ పోలింగ్ ఈనెల 29న పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్నాయంటూ వస్తున్న ఊహాగానాలను కేంద్రం కొట్టివేసింది. అలాంటి ఆలోచన ఏదీ లేదని వివరణ ఇచ్చింది. పశ్చిమాసియాలో ఘర్షణలతో గత రెండు నెలలుగా క్రూడాయిల్ ధరలు 50 శాతం పెరిగాయి. అయినప్పటికే రికార్డు స్థాయిలో గత నాలుగేళ్లుగా రిటైల్ పెట్రోల్, డిజిల్ ధరల్లో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. పశ్చిమాసియాలో తలెత్తిన ..మిగతా 2లో



### మహిళా బిల్లును
# ఆమోదించి తీరుతాం

**40 ఏళ్లుగా విపక్షాలు అడ్డుకుంటూనే ఉన్నాయి**

**వారణాసిలో ప్రధాని మోడీ**

**వారణాసి,ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**


పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కాంగ్రెస్, ఎస్పీ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే ఆ చట్టం అమల్లోకి ..మిగతా 2లో

## ఆదర్శ నగరాలతో పోటీపడేలా

# ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలి: సీఎం

మొదటి పేజీ తరువాయి...

లేనివిధంగా 160 కిలో మీటర్ల మేర ఓఆర్ఆర్ నిర్మించారని సీఎం గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీకి భూములిచ్చే రైతులను ఆదుకునే బాధ్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు. చట్టపరంగా నోటిఫికేషన్లు, న్యాయపరమైన ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయ్యిందన్న ఆయన భూమి ఇవాళ కాకపోతే రేపు అయినా ప్రభుత్వానికి బదిలీ అవుతుందని తెలిపారు. భూమి బదిలీ ఆగే అవకాశం లేదని, తాత్కాలికంగా వాయిదా పడవచ్చని చెప్పారు.అభద్రతా భావాన్ని తొలగించండి : ప్రభుత్వం



తరఫున ప్రక్రియ జరిగినపుడే పరిహారం డబ్బులు తీసుకుంటే మరోచోట తక్కువ ధరకు భూములు వచ్చేవని రైతులనుద్దేశించి సీఎం అన్నారు. ఆలస్యమైతే ఎకరాల్లో భూసేకరణ జరిగితే పరిహారం డబ్బులతో గజాల్లో కూడా వేరే చోట భూమి రాదని పేర్కొన్నారు. బాధితుల పిల్లలకు స్కిల్స్ వర్సిటీలో నైపుణ్య శిక్షణ ఇచ్చే బాధ్యత తీసుకుంటామని, ప్రజాప్రతినిధులు బాధితులతో మాట్లాడి అభద్రతా భావాన్ని తొలగించాలన్నారు. అభివృద్ధికి భూములిచ్చిన రైతులను గౌరవించాలని, స్థానికులు సహకరిస్తే ప్రపంచంలోనే అద్భుత నగరానికి పునాదులు వేగంగా పడతాయని పునరుద్ఘాటించారు.

# తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్

మొదటి పేజీ తరువాయి...

కుటుంబంలో సీవీ ఆనంద్ జన్మించారు. క్రమశిక్షణకు మారుపేరుగా చిన్నతనం నుంచి పెరిగారు. తండ్రి దామోదర్ రెడ్డి ఐఎఫ్ఎస్ అధికారి కావడంతో పరిపాలనపై చిన్నతనం నుంచే ఆయనకు అవగాహన ఏర్పడింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఉన్నత విద్య, నిజాం కాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేసిన సీవీ ఆనంద్ 1991లో ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు.

సీవీ ఆనంద్ ప్రవేశపెట్టిన మార్పులు నేటికీ ఆదర్శం : సీవీ ఆనంద్ తన కెరీర్ ప్రారంభంలోనే పదేళ్ల పాటు వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పని చేయడం ఆయనలోని పోరాట పటిమను చాటింది. ప్రాణాలకు తెగించి కీలక ఆపరేషన్లను లీడ్ చేసినందుకుగాను 2002లోనే ప్రెసిడెంట్ గ్యాలెంటరీ మెడల్ ఆయనను వరించింది. కేవలం శాంతిభద్రతలే కాకుండా, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోవడానికి ఈ కాలం పునాది వేసింది. హైదరాబాద్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాల్లో ఆయన ప్రవేశపెట్టిన మార్పులు నేటికీ ఆదర్శంగా ఉన్నాయి.

నగరంలోని రోడ్లపై మృత్యుఘోషను తగ్గించేందుకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలను కఠినతరం చేసి, జైలు శిక్షలు అమలు చేశారు. టెక్నాలజీని వాడుకుంటూ ఈ-చలాన్, స్పీడ్ గన్ వ్యవస్థలను ప్రాచుర్యంలోకి తెచ్చారు. సైబరాబాద్ కమిషనర్‌గా ఉన్నప్పుడు షీ టీమ్స్, షీ షటిల్స్ వంటి వినూత్న కార్యక్రమాలతో ఐటీ కారిడార్‌లో మహిళలకు భరోసానిచ్చారు. ఎండలో విధులు నిర్వహించే కానిస్టేబుళ్లకు సన్ గ్లాసెస్ పంపిణీ చేయడమే కాకుండా, వారికి 30 శాతం అదనపు పేమెంట్ వచ్చేలా ప్రభుత్వాన్ని ఒప్పించి సిబ్బంది నేతగా పేరు తెచ్చుకున్నారు.

ప్రభుత్వానికి రూ.2,000 కోట్ల ఆదా : సీవీ ఆనంద్ కేవలం పోలీస్ శాఖలోనే కాకుండా, పౌర సరఫరాలశాఖ కమిషనర్‌గా చేసినప్పుడు ఆన్‌లైన్ రేషన్ పంపిణీ ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేసి, కేవలం రెండేళ్లలో ప్రభుత్వానికి రూ.2,000 కోట్ల ఆదా చేశారు. ఇందుకోసం ఆయనకు 2017-18లో నేషనల్ ఈ-గవర్నెన్స్ అవార్డు లభించింది. కేంద్ర సర్వీసుల్లో సీఐఎస్ఎఫ్ ఐజీగా కోవిడ్ సమయంలో విమానాశ్రయాల భద్రతను పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషించారు. అవినీతి నిరోధక శాఖ డీజీగా బాధ్యతలు చేపట్టిన కేవలం 8 నెలల్లోనే 145 కేసులు నమోదు చేసి తెలంగాణ చరిత్రలో అత్యధిక కేసులు నమోదు చేసిన అధికారిగా రికార్డు సృష్టించారు. అనంతరం సెప్టెంబర్ 9,2024న రెండోసారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం హోం శాఖలో అత్యున్నత బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

: సీవీ ఆనంద్ కేవలం కాకీ చొక్కాకే పరిమితం కాలేదు. ఆయన ఒక అద్భుతమైన క్రీడాకారుడు. ఐపీఎస్ కాకముందే అండర్-19 భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆయన, ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడారు. అథ్లెటిక్స్, టెన్నిస్‌లోనూ జాతీయ స్థాయి పతకాలు సాధించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అనురాగ్ శర్మ, మహేందర్ రెడ్డిల తర్వాత పూర్తి కాలపు డీజీపీగా ఆయన సేవలు అందజేయనున్నారు. ఇప్పుడు రాష్ట్ర హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పదోన్నతి పొందిన ఆయన ప్రస్థానం నేటి యువ ఐపీఎస్ అధికారులకు ఆదర్శంగా ఉన్నారు.

# అమ్రాబాద్ పునరావాసానికి ఊతం

మొదటి పేజీ తరువాయి...

సమావేశం అటవీ,పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వన్యప్రాణి సంరక్షణకు సంబంధించిన పలు అంశాలను సమీక్షించారు. అలాగే రక్షిత అటవీ ప్రాంతాల్లో చేపట్టే పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. పునరావాసంపై కొందరు చేస్తున్న ప్రతికూల ప్రచారాన్ని మంత్రి దృష్టికి అధికారులు తీసుకువచ్చారు. అయితే ఈ ప్రక్రియ పూర్తిగా స్వచ్ఛందమని, గ్రామస్థుల విజ్ఞప్తుల మేరకే అమలు చేస్తున్నట్లు మంత్రికి వివరించారు. ఎవరిపైనా ఒత్తిడి చేయలేదని స్పష్టం చేశారు. బాచారం పునరావాస కాలనీలో ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూముల కేటాయింపుతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని సమావేశంలో మంత్రికి అధికారులు తెలిపారు. మరోవైపు ఏటూరునాగారం వన్యప్రాణి అభయారణ్యంలో రెండు రహదారి ప్రాజెక్టులకు కమిటీ సిఫార్సు చేసింది. ఈ ప్రాజెక్టుల అమలులో వన్యప్రాణి సంరక్షణ చర్యలకు ప్రత్యేక నిధులు కేటాయించారు. అలాగే డిండి బాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అటవీ భూమి వినియోగానికి అనుమతి ఇచ్చారు. ఇక కవాల్ టైగర్ రిజర్వ్, ప్రాణహిత వన్యప్రాణి అభయారణ్యం ప్రాంతాల్లో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ప్రతిపాదనలకు కూడా వన్యప్రాణి మండలి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మనుషులు--వన్యప్రాణుల మధ్య ఘర్షణలను తగ్గించేందుకు నెహ్రూ జూలాజికల్ పార్క్, అమ్రాబాద్, కవాల్, కాకతీయ జూలాజికల్ పార్క్‌లలో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే పర్యావరణ రుసుముల ద్వారా వచ్చిన నిధులను వన్యప్రాణి సంరక్షణ, ఈకోటూరిజం అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగింది. వికారాబాద్ జిల్లాలోని యెంకతల గడ్డి భూములను కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని సూచనలు వచ్చాయి. మంజీరాను రామ్సార్ సైట్‌గా ప్రకటించే ప్రతిపాదనపై కూడా చర్చించారు. ఆసిఫాబాద్ జిల్లాలో ప్రతిపాదించిన ఎథనాల్ ప్లాంట్, డిండి ముంపు ప్రాంతంలో కేబుల్ లేయింగ్ ప్రాజెక్ట్‌లను పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా తిరస్కరించారు. వన్యప్రాణి మండలి స్టాండింగ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర అటవీ శాఖ అధిపతి డాక్టర్ సీ సువర్ణ, వన్యప్రాణి ముఖ్య సంరక్షణాధికారి వినయ్ కుమార్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ( వన్యప్రాణి విభాగం) క్షితిజ, జూస్ అండ్ పార్క్స్ డైరెక్టర్ , అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమత్, జూపార్కు క్యూరేటర్ జె. వసంత, డీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఆంజనేయులు, డిప్యూటీ క్యూరేటర్ జె. మురళీధర్ తదితరులు పాల్గొన్నారు

## దేశవ్యాప్తంగా కొరతపై పుకార్లు

మొదటి పేజీ తరువాయి...

ఘర్షణల కారణంగా చమురు ఉత్పత్తి ధరలు, పంప్ ధరల మధ్య వ్యత్యాసం పెరగింది. దీంతో ఇంధనం రిటైలర్లు ప్రతిరోజూ రూ.2,400 కోట్ల మేర నష్టాలను చవిచూస్తున్నారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారంతో పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పూర్తికాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం అనివార్యమని బలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదన ఏదీ లేదని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో 'ప్యానిక్ బైయింగ్' జరుగుతున్నట్టు తెలుస్తోందని, ఆయా ప్రాంతాల్లో పరిస్థితి గురించి రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నామని, రిటైల్ ఔట్‌లెట్స్‌ను మానిటర్ చేస్తున్నామని, అవసరమైన సరఫరాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, స్టాక్ అందుబాటులో ఉండేలా చూస్తున్నామని, ఎలాంటి డ్రైఔట్‌లు లేవని చెప్పారు. 'తగినన్ని ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్ సరఫరాలు మావద్ద ఉన్నాయి. ధరలు కూడా నిలకడగా ఉన్నాయి. రేట్లలో ఎలాంటి పెరుగుదల లేదు' అని వివరించారు. వదంతులు నమ్మవద్దని కోరారు.

## మహిళా బిల్లును ఆమోదించి తీరుతాం

మొదటి పేజీ తరువాయి...

రాకుండా ఆగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని..అందువల్లే 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నారని అన్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు. వారణాసిలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహా యజ్ఞం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నానని..అందుకు మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకునేందుకు వారణాసి వచ్చానని ప్రధాని పేర్కొన్నారు. ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని..ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని అన్నారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని కోరుకున్నానని తెలిపారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం అధికారం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు.



## తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. లేదంటే చర్యలు తప్పవు

### రామకృష్ణ వీధిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తకుప్పలను శుభ్రం చేయించిన జనంపల్లి సురేందర్ రెడ్డి

**కూకట్ పల్లి, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదేశాల మేరకు వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ కాలనీలో పేరుకుపోయిన చెత్త చెదారని మున్సిపల్ సిబ్బంది గత రెండు రోజుల నుంచి చెత్తకుప్పలు, మట్టి దిబ్బలు, రాళ్లు వివిధ మట్టిని తొలగించి రోడ్లన్నీ శుభ్రం చేశారు. అనంతరం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో తెలంగాణ ప్రభుత్వంలో కాలనీలో రోడ్లపై ఉన్న చెత్త చెదారాన్ని క్లీన్ గా ట్రాక్టర్ ద్వారా లోడ్ చేయించడం జరుగుతుందన్నారు. ఎవరైనా కాలనీవాసులు రోడ్డుపై చెత్త వేసినచో కఠిన చర్యలు తీసుకోబడునని అధ్యక్షులు కమిటీ సభ్యులు కాలనీవాసులకు తెలియజేశారు. కాలనీలో ఏ సమస్యలైనా ఎలాంటి కార్యక్రమాలైనా దగ్గర ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ శాయశక్తుల కృషి చేస్తానని, ఎల్లప్పుడూ కాలనీలో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ కాలనీవాసుల ఆశీస్సులతో ముందుకెళ్తున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది జవాన్ కుమార్, సూపర్వైజర్ రవీందర్ నాయక్, కమిటీ సభ్యులు శ్రీధర్, జి ప్రసాద్, సుధాకర్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధితో జూపార్కుకు కొత్త వన్నె

మొదటి పేజీ తరువాయి...

అని నామకరణం చేశారు మంత్రి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు అద్భుతంగా ఉన్నాయని, వాటి పట్ల సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం, విహార్ ఫుడ్ కోర్ట్, టికెటింగ్ కియోస్క్‌ను ఏర్పాటు చేసి సందర్శకులకు అదనపు సౌకర్యాలు కల్పించడం విశేషమని గుర్తు చేశారు. జంతుప్రదర్శనశాల అభివృద్ధి కోసం జూ అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పటికే ఉన్న 154 రకాల వన్యప్రాణులు ప్రదర్శనలో ఉండగా కొత్తగా ప్రారంభించిన ప్రదర్శన శాలలతో మరింత శోభ సమకూరుతుందని వివరించారు. జంతువులు, పక్షుల ఆవాసాల్లో మొక్కలను పెంచి, చురుకుగా ఉంచడానికి తాడులు, షెడ్లు, బుట్టలు, దాక్కునే ప్రదేశాలు మొదలైన అనేక వస్తువులను ఏర్పాటు చేయడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జూ పార్క్స్ డా. సునీల్ ఎస్. హిరేమత్, శ్రీమతి క్షితిజ, సిసిఎఫ్ వైల్డ్ లైఫ్ జె. వసంత, క్యూరేటర్ జె. వసంత, ఆదిలాబాద్ డిఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, డిప్యూటీ క్యూరేటర్ జె. మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్ (వెట్) రిటైర్డ్ డా. నవీన్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ (వెట్) డా. ఎం.ఎ. హకీమ్, అసిస్టెంట్ డైరెక్టర్ (వెట్) డా. పి. శ్రీనివాస్ రెడ్డి, వి.ఎ.ఎస్. డా. మోహన్ రెడ్డి, అసిస్టెంట్ క్యూరేటర్ లు నజియా తబస్సుమ్, ఎం. లక్ష్మణ్, మురళీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బెంగాల్లో రెండోదశ పోలింగ్

మొదటి పేజీ తరువాయి...

ముందు రాష్ట్రంలో నాటుబాంబులు లభించడం, స్వల్ప పేలుడు ఘటనల నేపథ్యంలో ఈసీ అప్రమత్తమైంది. కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం, ఓటింగ్‌కు అంతరాయం కలిగించేందుకు దుండగులు బాంబులను ఉపయోగించే ప్రమాదం ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎకు సూచించింది. రాష్ట్రంలో పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దక్షిణ పరగణాలు జిల్లాలోని భాంగర్ ప్రాంతంలో ఇటీవల ఓ ఇంట్లో అనేక నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ, ముమ్మర దర్యాప్తు చేపట్టింది.

## కార్మికుడి కుమార్తె వివాహానికి ఆనంద్ కృష్ణారెడ్డి ఆర్థిక సాయం

**పటాన్ చెరు, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం):**

తమ కష్టంతో సమాజాన్ని శుభ్రం చేసే సఫాయి కార్మికుల జీవితాల్లో చీకటి నిండినప్పుడు, వారికి అండగా నిలవడమే నిజమైన సామాజిక బాధ్యత అని బొల్లారం బిజెపి పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి మరోసారి చాటిచెప్పారు. బొల్లారం జి.హెచ్.ఎం.సి 272వ డివిజన్, ఎస్సీ కాలనీకి చెందిన నరసింహ గతంలో మున్సిపాలిటీలో సఫాయి కార్మికుడిగా పనిచేసేవారు. ఏడాది క్రితం బాలాజీ నగర్ కాలనీలో విధి నిర్వహణలో భాగంగా డ్రైనేజీ క్లీన్ చేస్తూ ప్రమాదవశాత్తు మరణించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఆ కుటుంబం రోడ్డున పడినా, ప్రభుత్వం నుండి నేటికీ ఎలాంటి నష్టపరిహారం అందకపోవడం అత్యంత విచారకరం అని ఆవేదన వ్యక్తంచేశారు. దివంగత నరసింహ కుమార్తె సూర్య కుమారి వివాహం ఈ నెల 29న జరగనున్న నేపథ్యంలో తండ్రి లేని లోటు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. తన వంతు సామాజిక బాధ్యతగా పెళ్లి కుమార్తెకి నూతన వస్త్రాలు, 10,000



రూపాయల నగదును అందజేశారు.ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి భావోద్వేగంతో మాట్లాడుతూ నరసింహ చనిపోయినప్పుడు మీకు న్యాయం చేయాలని పోరాడాను, కానీ ప్రభుత్వం స్పందించలేదు. ఆనాడు న్యాయంచేయలేకపోయాననే వెలితి నాలో ఉంది. కానీ నేడు మీ బిడ్డ పెళ్లికి ఒక అన్నగా తోడుంటాను. మీరు అధైర్యపడకండి, సంతోషంగా పెళ్లి చేసుకోండి. ప్రభుత్వం నుండి రావాల్సిన పరిహారం అందే వరకు మీ తరపున తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని భరోసా ఇచ్చారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తాం

### జాయింట్ కలెక్టర్ వినోద్ కుమార్

### ఎమ్మెల్యే ఆదేశాలతో స్పందించిన అధికారులు

**కొత్తకోట, ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు పూర్తిగా న్యాయం చేస్తామని వనపర్తి జిల్లా జాయింట్ కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారంకొత్తకోట పట్టణ రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా జాయింట్ కలెక్టర్ వినోద్ కుమార్ కొత్త కోట పట్టణంలో కొనుగోలు కేంద్రాలు మదనాపురం మార్కెట్ యార్డులో అకస్మాతిగా సందర్శించి కొత్తకోట సింగల్ విండో కార్యాలయంలోవడ్లు కొనుగోలు విషయంలో పిఎసిఎస్ సీఈవోలు, ఏ పి ఎం అధికారులు, రైస్ మిల్లర్స్ ఓనర్స్ తో,ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ తో లారీల విషయాలు, గన్ని బ్యాగుల గురించి అధికారులతో సమీక్షించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాపిగా జరిగేందుకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశాలకు స్పందించి ఈరోజు ధాన్యము కంటాలు చేసి ధాన్యం లిఫ్ట్ చేయడం జరుగుతుంది రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా జెయింట్ కలెక్టర్ గారి వెంబడి మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లె పాగు ప్రశాంత్,కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల



రోడ్డుపై అరబోసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వినోద్ కుమార్

శ్రీనివాస్ రెడ్డి, చర్లపల్లి సర్పంచ్ శేఖర్ రెడ్డి, మదనపురం సర్పంచ్ రామకృష్ణ, రామన్ పాడు సర్పంచ్ అంజద్ అలీ మహేష్ కుమార్, లిపెంటన్న యాదవ్, పి మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కోటేష్, రంగన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సర్ పరిశీలన, మ్యాపింగ్‌పై బీఎల్ఓలకు పూర్తి శిక్షణ ఇవ్వాలి

**బుద్వేల్, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ను పకడ్బందిగా నిర్వహించాలని బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్రెడ్డి కోరారు. మంగళవారం ఉప్పర్ పల్లి, శివరాంపల్లి బస్తీలలో అత్తాపూర్ సర్కిల్ కు చెందిన బూత్ లెవల్ ఆఫీసర్లు చేపడుతున్న సర్ మ్యాపింగ్ ప్రక్రియ ను ఆయన బీజేపీ నాయకులు గుంజ బాబురావు, హరికిషన్ జీ, సదాల రాజశేఖర్ రెడ్డి, పవన్ కుమార్ లతో కలసి పరిశీలించారు. ఓటరు జాబితా ను అత్యంత ఖచ్చితంగా, నకిలీలు లేకుండ అప్డేట్ చేయడానికి ప్రత్యేకమైన సమగ్రమైన సర్ కార్యక్రమం నీరుగారకుండ చూడాలన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ కు సరైన అవగాహన లేకుండ





సర్ సర్వే ప్రక్రియ ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి

చేస్తున్నారన్నారు. 2002 నాటి ఓటరు వివరాలను అడుగుతున్న బీఎల్ఓ లు ఇంటింటి మ్యాపింగ్ చేస్తున్న తీరు కరెక్టుగా లేదన్నారు. బీఎల్ లకు యాప్ వినియోగం పై అవగాహన సరిగ్గా లేదన్నారు. వారికి సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. దీనిపై అధికారులు సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు.

# కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో సమావేశమైన మంత్రి వాకిటి శ్రీహరి

**బుద్వేల్, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

రాష్ట్రాల సమాహారమే కేంద్రం అని, కేంద్ర ప్రభుత్వం నిధులను సమానంగా పంచాలని తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. రాజేంద్రనగర్ లోని నేషనల్ ఫిషరీస్ డెవలమెంట్ బోర్డు (ఎన్ఎఫ్ఎబీ) కార్యాలయంలో మంగళవారం కేంద్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తో ప్రత్యేక భేటి అయ్యారు. ఈ భేట్ లో మత్స్యశాఖ డైరెక్టర్ నిఖిల, పశుసంవర్ధక శాఖ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. తెలం గాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి నాయకత్వంలో పశుసంవర్ధక, పాడి, మత్స్యశాఖల్లో అమలు చేస్తున్న పథకాలను మంత్రి వాకిటి శ్రీహరి కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్రం నుంచి



కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను కలసి సన్మానిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

తెలంగాణ కు పూర్తి సహకారం అందజేయాలని కోరారు. అక్వా కల్చర్, లైఫ్ సెన్సెస్ ఇన్సూరెన్స్, మోపెడ్ కేటాయింపుల్లో న్యాయం చేయాలని కేంద్ర మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గోదావరి, క్రిష్ణా నదుల మధ్య ఉన్న 46వేల చెరువులు. 26వేల చిన్న చెరువులు 100 రిజర్వాయర్ల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులను తీసుకురావడంలో విఫలం అయ్యిందన్నారు.

**ఎన్ ఎఫ్ డీ బీ ని తరలించం అని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి: మంత్రి వాకిటి శ్రీహరి :**

రాజేంద్రనగర్ లో ఉన్న నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు (ఎన్ ఎఫ్ డీ బీ) తరలింపు పై వస్తున్న ప్రచారంపై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలి పారు. రాజేంద్రనగర్ లో ఉన్న ఎన్ఎఫ్డీబీ ని తరలించే ఆలోచన కేంద్రానికి లేదని, రాజేంద్రనగర్ లోనే ఆ సంస్థ కొనసాగుతుందని కేంద్ర మంత్రి తెలిపారని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు



# ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం

## మాజీ సి డి సి చైర్మన్ భీసం చేన్నకేశవరెడ్డి

**కొత్తకోట, ఏప్రిల్ 28 ( నమస్తే ఉదయం)**

రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని సి డి సి మాజీ చైర్మన్ భీసం చెన్నకేశవరెడ్డి ఆరోపించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు సెంటర్లకు గత ఇరవై రోజులుగా ధాన్యం వస్తున్నా ఇంకా ప్రారంభం కావడం లేదని ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భీసం చేన్నకేశవరెడ్డి ఆరోపించారు.కొత్తకోట పట్టణ శివారులోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో చాలా చోట్ల పిఎసిఎస్, ఐకెపి ఆధ్వర్యంలో గత పది రోజుల క్రితమే హడావుడిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఇప్పటివరకు ధాన్యాన్ని కొన్నది లేదు. పత్తాలేని కొనుగోలు కేంద్రాల నిర్వహకులు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కోసి కుప్పలు పోస్తే వాటిని కొనే నాథుడే లేడు. రోడ్లపైనే పడిగాపులు కాస్తున్న రైతన్నలు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర విడి తక్షణమే వరి ధాన్యాన్ని కొనాలని లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో కొత్తకోట పట్టణ కౌన్సిలర్ తిరుపతయ్య, రైతులు జలంధర్ రెడ్డి,రంగారెడ్డి,వేంకట్ రెడ్డి, గోవిందు రెడ్డి, వేముల దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కూకట్‌పల్లిలో 'సాఫ్ట్ మీడియా అకాడమీ' పేరుతో విద్యార్థులకు మోసం

## ఎండీ పుష్పారెడ్డిపై తెలంగాణ ప్రోగ్రెసివ్ యూత్ ఫెడరేషన్ ఫిర్యాదు

**కూకట్ పల్లి, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

విముక్త చిరుతల కచ్చి పార్టీ అధికార ప్రతినిధి తెలంగాణ శ్యామ్, తెలంగాణ ప్రోగ్రెసివ్ యూత్ ఫెడరేషన్ అధ్యక్షులు నగేష్ సతీష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి మట్టే ప్రసన్న కుమార్ సంయుక్తంగా మాట్లాడుతూ, కూకట్‌పల్లిలో 'సాఫ్ట్ మీడియా అకాడమీ' పేరుతో నిర్వహిస్తున్న సంస్థ విద్యార్థుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేసి, సంవత్సరాలు గడుస్తున్నా పరీక్షలు నిర్వహించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నించిన విద్యార్థులపై యాజమాన్యం దురుసుగా ప్రవర్తిస్తూ, అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషిస్తూ "మీకు దిక్కున్న చోట చెప్పుకోండి" అని బెదిరింపులకు దిగుతున్నట్లు విద్యార్థులు వాపోతున్నారని వారు పేర్కొన్నారు. బాధ్యత మరిచి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న మేనేజింగ్ డైరెక్టర్ పుష్పారెడ్డి, 'సాఫ్ట్ మీడియా అకాడమీ'పై తగిన చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత విద్యార్థులు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి, విద్యార్థులకు న్యాయం చేసి, ఇలాంటి మోసపూరిత సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని విముక్త చిరుతల కచ్చి పార్టీ డిమాండ్ చేస్తున్నాయి.

# కేంద్ర మంత్రికి సన్మాణం

**బుద్వేల్, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ లోని నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు ను సందర్శించిన కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను మంగళవారం బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి కలసి సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో మత్స్య కారుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. యువత కు ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోనె శ్రీకాంత్ రెడ్డి, పవన్, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను సన్మానిస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి

# పేదవాడి ఆకాంక్షను నెరవేర్చేల ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది

## టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

**కూకట్ పల్లి, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

ప్రతి పేదవాడి ఆకాంక్షను నెరవేర్చేలా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల 32 ప్రధాన డిమాండ్లను ఏకకాలంలో అంగీకరించి ఆమోదించినందుకు, సమ్మె విరమింప చేసినందుకు కృతజ్ఞతగా మంగళవారం కేపీహెచ్బీ కాలనీ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండి రమేష్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సమ్మె సందర్భంగా ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ



సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళు అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను కేవలం రెండు రోజుల్లోనే పరిష్కరించి వారి డిమాండ్లకు అంగీకరించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పట్ల వెటకార ధోరణితో వ్యవహరించిందన్నారు. శంకర్ గౌడ్ తొందరపాటు నిర్ణయంతో ఆత్మహత్యకి పాల్పడడం బాధాకరమన్నారు. అతని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్మికులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి జిందాబాద్ కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు డ్రైవర్లు కండక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కెపిహెచ్బి డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, బాలాజీ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజపుత్, గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ రాజేష్ గౌడ్, గొట్టిముక్కల జస్వంత్ రావు, జివిఆర్, కరుణాకర్ నాయుడు, రాఘవేందర్, సతీష్ గౌడ్, ఫణీంద్ర కుమార్,సంధ్య, బండి సుధా, వనజ, విజయలక్ష్మి, జయలక్ష్మి, అపర్ణ నాయుడు, స్వాతి రెడ్డి, లక్ష్మి, యమునా, సరోజ, తదితరులు పాల్గొన్నారు..



### బాలానగర్‌లో ఘనంగా

# హిందూ సమ్మేళనం

## 5,000 మందికి పైగా హాజరు, ఆధ్యాత్మికం

**కూకట్ పల్లి, ఏప్రిల్ 28,(నమస్తే ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రాంతంలో హిందూ ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమం అత్యంత వైభవంగా, ఆకర్షణీయంగా జరిగింది. బాలానగర్ జై శ్రీరామ్ జాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మహాసభకు దాదాపు 5,000 మంది హిందూ సోదరులు, సోదరీమణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొదటిసారిగా బాలానగర్ వేదికపై ఈ స్థాయిలో హిందూ బంధువులందరూ ఒకే చోట చేరడం విశేషంగా నిలిచింది. ఈ సమ్మేళనం ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించింది. రంగురంగుల సాంస్కృతిక కళారూపాలు, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించగా, సామూహికంగా నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమానికి భక్తి మాధుర్యాన్ని చేకూర్చింది. పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ శ్రీ ఆదిత్య పరశ్రీ స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనాలు సభలో ఉన్నవారిని ఆలోచింపజేస్తూ, భక్తి మార్గంలో నడిచేలా ప్రేరేపించాయి. అలాగే అఖిల భారత గో సేవ ఫౌండేషన్‌కు చెందిన శ్రీ బాలకృష్ణ గురుస్వామి గోసంరక్షణ ప్రాముఖ్యతపై ఇచ్చిన సందేశం ప్రజల్లో చైతన్యాన్ని కలిగించింది. ఈ మేరకు తెలంగాణ ప్రాంత నిర్వాహకులు కాచం రమేష్ సమాజంలో ఐక్యత, సేవాభావం అవసరాన్ని వివరించగా, తెలంగాణ సామాజిక కార్యకర్త రుక్మిదేవి సందేశం మహిళల పాత్ర, సమాజ నిర్మాణంలో వారి బాధ్యతలను స్పష్టంగా చేశారు. మొత్తంగా ఈ హిందూ సమ్మేళనం బాలానగర్ ప్రాంతంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, హిందూ సమాజ ఐక్యతకు బలమైన వేదికగా నిలిచింది. పాల్గొన్నవారు ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.





### మంచినీటి సరఫరాలో

# ఎలాంటి ఇబ్బందులు లేవు

## జలమండలి అధికారుల స్పష్టీకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**


ఇటీవల కేటీఆర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాజీ సీఎం కేసీఆర్ నివాసానికి ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేసిన అంశాన్ని ప్రస్తావిస్తూ నగరంలో నీటి కొరత ఉందని పేర్కొనడం జరిగిందని ఆరోపించారు

**జలమండలి వివరణ:**

మాజీ సీఎం కేసీఆర్ నివాసానికి (కన్స్యూమర్ నెం: 612178979) సాధారణంగా షెడ్యూల్ ప్రకారం నీటి సరఫరా కొనసాగుతోంది. ప్రస్తుతం మీటర్ మరమ్మత్తులో ఉన్నది. ఈ కాలనీలో ఒక రోజు విడిచి ఒక రోజు నీరు ఇస్తున్నారు. ఈ నివాసంలో సమావేశాలు లేదా రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు అవసరాన్ని బట్టి ట్యాంకర్ ద్వారా అదనపు ట్యాంకర్ కోసం కేసీఆర్ పర్సనల్ పీఏ అభ్యర్థన మేరకు జలమండలి అదనపు ట్యాంకర్ తో నీరు సరఫరా చేస్తున్నది. గత ఐదు సంవత్సరాలుగా అవసరానికి తగ్గట్టుగా అభ్యర్థన మేరకు జలమండలి ట్యాంకర్ లను సరఫరా చేస్తోంది. 24 తేదీన న స్టడి సర్కిల్ వద్ద పైప్‌లైన్ చోక్ కారణంగా తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. అదే రోజు సమస్యను పరిష్కరించి సరఫరా పునరుద్ధరించినట్టు స్థానిక చీఫ్ జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు.



నూతన కమిషనర్ ముకుంద రెడ్డికి పుష్పగుచ్చం అందజేస్తున్న రాష్ట్ర టీ డబ్ల్యూ జే అధ్యక్షులు విరాహత్ అలీ



మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి కి పుష్పగుచ్చం అందజేస్తున్న నూతన కమిషనర్ ముకుంద రెడ్డి

# మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసిన నూతన సమాచార శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి

## నూతన కమిషనర్ ను కలిసిన టీయుడబ్ల్యూజే నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**

రాష్ట్ర సమాచార , పౌర సంబంధాల శాఖ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన జి.ముకుందరెడ్డి తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో రాష్ట్ర బాధ్యులు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని విరాహత్ కోరారు. కమిషనర్ ను కలిసిన వారిలో టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్యూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డిలు ఉన్నారు.

# జన గణన స్వీయ నమోదు చేసుకున్న జిల్లా పాలనాధికారి

## స్వీయ గణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపు: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**



జన గణన ప్రక్రియలో భాగంగా జిల్లా పాలనాధికారి రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం కలెక్టరేట్ లోని ఛాంబర్లో స్వీయ నమోదు చేసుకున్నారు. జన గణనలో ఎవరికి వారు స్వయంగా వివరాలు నమోదు చేసుకునేలా అందుబాటులోకి తెచ్చిన ఆన్ లైన్ వెబ్ సైట్ https://se.census.gov.in ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జన గణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన (Digital Self-Enumeration) విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఆన్లైన్ ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను వెబ్ పోర్టల్ లో కానీ , మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రతి ఒక్కరు ఈ మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 26 నుండి మే 10వ తేదీ వరకు స్వీయ నమోదు చేసుకోవచ్చని సూచించారు. జన గణనకు సంబంధించిన సమాచారాన్ని 15 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసుకోవచ్చని అన్నారు. వివరాలు నమోదు చేసిన అనంతరం ప్రత్యేకమైన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి (రాజు×ణ) జారీ చేయబడుతుందని తెలిపారు. ప్రభుత్వంచే నియమించబడిన ఫీల్డ్ ఎన్యుమరేటర్లు మే 11 నుంచి జూన్ 09వ తేదీ మధ్యకాలంలో క్షేత్రస్థాయిలో ఇంటికి వచ్చిన సమయంలో వారికి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐ.డి నెంబర్ తెలియజేయాలని సూచించారు. ప్రజలు తమ వివరాలను ప్రస్తుతం ఆన్లైన్ పోర్టల్ ద్వారా స్వీయ నమోదు చేసుకుంటే, ధృవీకరణ సమయంలో వారు ఇంట్లో భౌతికంగా ఉండాల్సిన అవసరం ఉండదని, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సమాచారాన్ని సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐ.డి ద్వారా ఎన్యూమరేటర్ పరిశీలించి ధృవీకరిస్తారని అన్నారు. దీనివల్ల ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండే వారు, విద్యార్థులు, వలస కార్మికులు, ప్రయాణాల్లో ఉన్న ప్రజలు కూడా జనగణనలో వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు.అయితే, స్వీయ గణనలో ఖచ్చితమైన చిరునామా, సరైన వివరాలు నమోదు చేయాలని, వీటి ఆధారంగానే ఎన్యూమరేటర్లను నియమించడం జరుగుతుందన్నారు. జనగణన ప్రక్రియలో సాంకేతికతను వినియోగించి సమగ్రతను పెంచడం, ప్రతి పౌరుడి వివరాలు జన గణనలో చేరేలా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా కల్పించారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ఎంతగానో దోహదపడే జన గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతం అయ్యేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు.కార్యక్రమంలో జిల్లా గణాక శాఖ అధికారి పాపయ్య వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పి. జి. సెంటర్‌లో పుస్తక ప్రదర్శనశాల

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

పీజీ సెంటర్ గద్వాల, పాలమూరు విశ్వవిద్యాలయం లో మంగళవారం నాడు తెలంగాణ ప్రభుత్వం, ఉన్నత విద్యా మండలి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు పుస్తక ప్రదర్శనశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చవ్వా వెంకటరెడ్డి గారు పాల్గొని విద్యార్థులకు ఉద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు పుస్తక పఠనం వైపు ఆకర్షింపబడతారని తద్వారా అజ్ఞాన తిమిరాలు తొలగి జ్ఞాన దీపాలు వెలిగించేవారుగా తయారవుతారని ఆకాంక్షించారు. ముఖ్యంగా నేటి తరం విద్యార్థుల్లో సెల్ ఫోన్ల వల్ల విపరీత పరిణామాలు చోటుచేసుకున్నాయని అలాంటి వారిని తిరిగి మంచి నడవడిక వైపు ఆకర్షించడానికి, సమాజంలోని వర్తమాన అంశాలను తెలుసుకోవడానికి పుస్తక పఠనమే దివ్యమైన ఔషధమని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి గ్రామాల్లోనూ, ముఖ్యంగా పాఠశాలల్లో నిర్వహిస్తే పుస్తకాలను నేటితరం విద్యార్థులకు పరిచయం చేసిన వారం అవుతామని ఆకాంక్షించారు. అలాగే ఈ కార్యక్రమంలో పుస్తక సేకరణ మొదలుకొని అందంగా ప్రదర్శించడంలో ప్రధాన భూమిక పోషించిన ఆంగ్ల శాఖ అధ్యాపకులు బండారపల్లి అరవింద, నమ్రత, శ్వేతలను అభినందించారు. ఈ ప్రదర్శనలో సామాజిక రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన పుస్తకాలను ఉంచారు.వీటితో పాటు ఆయా డిపార్ట్మెంట్ లకు సంబంధించిన పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు ప్రదర్శన లో ఉన్నాయి.ముఖ్యంగా భారత రాజ్యాంగం, అంబేద్కర్ , పూలే వివేకానందల రచనలు విద్యార్థులకు ఆసక్తిని కలిగించాయి. ఈ ప్రదర్శన వల్ల విద్యార్థులకు విభిన్న రకాల పుస్తకాల కనిపించడం వల్ల పఠన నైపుణ్యాన్ని పెంపొందించడం, తద్వారా విద్యార్థుల జ్ఞానాన్ని విస్తరింప చేయడం జరుగుతుంది. అలాగే ప్రసిద్ధ రచయితలు ,వారి రచనలు పరిచయం అవుతాయి. కొత్త విషయాలు నేర్చుకోవడానికి, పరిశోధనలు చేయడానికి ఈ ప్రదర్శన ప్రేరణగా నిలుస్తుంది. అదేవిధంగా భిన్నభాషల పుస్తకాలను చదవడం ద్వారా భిన్న సంస్కృతులు తెలుసుకోవడానికి, సమాజంలో జ్ఞాన వాతావరణాన్ని పెంపొందించడానికి ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుంది. .ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డా. గోపీనాథ్ రాథోడ్, వంగూరి గణేష్, డా. కే. మహేందర్, డా. రవి షరీన్, నవీన్ గౌడ్, ఎండి రఫీ, రంగారెడ్డి, డా. జంపుల, తిరుపతయ్య, లక్ష్మయ్య, నరేష్ రెడ్డి, శ్రీనివాసులు, బోధనేతర సిబ్బంది అన్వేష్, అలాగే విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# సమ్మర్ క్యాంపు అంశాలు భవిష్యత్తులో ఎంతో దోహదపడతాయి: డిజిపి శివధర్ రెడ్డి

**రాజేంద్రనగర్ (బండ్లగూడ), ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ బి. శివధర్ రెడ్డి, హైదరాబాద్‌లోని ఆర్ బి వి ఆర్ ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ లో సిబ్బంది సంక్షేమ కార్యక్రమాల భాగంగా నిర్వహించిన పిల్లల సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ శిబిరానికి మొత్తం 65 మంది పిల్లలు నమోదు చేసుకుని ఉత్సాహంగా కార్యకలాపాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా వేసవి సెలవుల్లో పిల్లలకు నిర్మాణాత్మక , అభివృద్ధి చెందే వేదికను అందించడం లక్ష్యం. శారీరక, సృజనాత్మక , మేధోపరమైన కార్యకలాపాల సమ్మేళనం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ఇది దోహదపడుతుంది. సభను ఉద్దేశించి మాట్లాడిన డీజీప , తన చిన్ననాటి వేసవి సెలవుల జ్ఞాపకాలను స్మరించుకున్నారు. స్వగ్రామంలో, తాతమామల ఇంట్లో గడిపిన రోజులను గుర్తుచేసుకుంటూ, గ్రామంలోని బావుల్లో ఈత కొట్టడం, మామిడి తోటలను సందర్శించడం వంటి అనుభవాలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పిల్లల్లో సాంస్కృతిక అవగాహన మరియు భాషాపట్ల ఆసక్తి పెంపొందించేందుకు తెలుగు భాషా తరగతులు, ప్రముఖ తెలుగు కవుల పద్యాలు, శతకాలను చేర్చాలని సూచించారు. టి జి పి ఏ డైరెక్టర్ అభిలాషా బిష్ట్ మాట్లాడుతూ... ఈ సమ్మర్ క్యాంప్ అకాడమీ సిబ్బంది సంక్షేమం , సామాజిక బాధ్యత పట్ల తమ నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. పిల్లలు నేర్చుకోవడానికి, అన్వేషించడానికి , ఎదగడానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో ఈత, యోగా, పెయింటింగ్, డ్రాయింగ్, చెస్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో సంగీతం, నాటకం, నృత్యం , నటన వంటి విభాగాలను కూడా చేర్చే ప్రతిపాదనను టి జి పి ఏ డైరెక్టర్ తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో భద్రతా చర్యలతో కూడిన క్రమబద్ధమైన శిక్షణను అకాడమీ అందిస్తోంది. ఈ సందర్భంగా ఈనెల 30వ తేదీన పదవీ విరమణ పొందనున్న డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారి విశిష్ట నాయకత్వం, అంకితభావం, రాష్ట్రంలో పోలీసింగ్ ప్రమాణాలను మెరుగుపర్చడంలో చేసిన కృషిని ప్రశంసించారు. కార్యక్రమానికి డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్ తదితర ఉన్నతాధికారులు హాజరై కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తల్లిదండ్రులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని టి జి పి ఏ సమ్మర్ క్యాంప్‌కు శుభారంభం కల్పించారు.

# తెలంగాణ సజ్జాపూర్ చామదుంప భౌగోళిక గుర్తింపు దరఖాస్తును చెన్నై జీఐ రిజిస్ట్రీ ఆమోదించింది

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**





ప్రసిద్ధ సజ్జాపూర్ చామదుంప భౌగోళిక గుర్తింపు దరఖాస్తు, దరఖాస్తు నంబరు 2025తో చెన్నై జీఐ రిజిస్ట్రీకి విజయవంతంగా సమర్పించబడింది. 28 ఏప్రిల్ 2026న చెన్నై జీఐ రిజిస్ట్రీ ఆమోదించింది. ఈ దరఖాస్తును తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (౧+జూూ) పేరు మీద దాఖలు చేశారు. తెలంగాణ జీఐ మ్యాన్‌గా పేరుగాంచిన సుభాజిత్ సాహా, హెడ్ - లీగల్, రిజల్యూట్4ఐపిలి ఈ దరఖాస్తును దాఖలు చేశారు. తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. పిడిగం సైదయ్యలి, తెలంగాణ టీజీసీఓఎస్టీ మద్దతుతో చేపట్టిన ఈ భౌగోళిక గుర్తింపు ప్రాజెక్టుకు ప్రధాన పరిశోధకుడిగా ఉన్నారు. సంగారెడ్డి జిల్లా, కోహిర్ మండలం, సజ్జాపూర్ గ్రామంలో పండించే సజ్జాపూర్ చామదుంప పుట్టుక, దాని రకపు లక్షణాలు, జీవరసాయన ప్రొఫైలింగ్, రైతుల పద్ధతులు, డిఎన్ఏ ప్రొఫైల్, విశిష్ట లక్షణాలకు భౌగోళిక సంబంధాలు మరియు ఇతర విషయాల గురించి డాక్టర్ సైదయ్య కీలక సమాచారాన్ని సేకరించారు. భౌగోళిక సూచిక (+×) రక్షణ కోసం దరఖాస్తు చేసిన మొట్టమొదటి చామదుంప రకం సజ్జాపూర్ చామదుంప. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి మాట్లాడుతూ... 'భౌగోళిక సూచిక (+×) నమోదు రైతులకు, ముఖ్యంగా సజ్జాపూర్ చామదుంప రకాన్ని సాగు చేసే వారికి ఒక గేమ్-ఛేంజర్ అవుతుంది. దీనికి ముఖ్యంగా అధిక ధర, మార్కెట్లో ప్రత్యేకత మరియు ఎగుమతి సామర్థ్యం వంటి ఆర్థిక, మార్కెట్ ప్రయోజనాలు ఉన్నాయి' అని అన్నారు. '+×-ట్యాగ్ ఉన్న ఉత్పత్తులు వాటి నాణ్యత , ప్రామాణికత కారణంగా నిజంగా అధిక ధరలను పొందుతాయి. ఇప్పుడు, ఉద్యాన విశ్వవిద్యాలయం తెలంగాణ ఉద్యాన వారసత్వాన్ని పరిరక్షించడానికి కృషి చేస్తోంది, ఇందులో భాగంగా మరో 5 పంటలు వరుసలో ఉన్నాయి అని ఆయన అన్నారు. ' లితెలంగాణ టీజీసీఓఎస్టీ మెంబర్ సెక్రెటరీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... జీఐ ట్యాగ్‌లు ప్రపంచ మార్కెట్లను సులభంగా చేరుకోవడానికి వీలు కల్పిస్తాయని, రిజిస్ట్రేషన్ అనేది పేరును అనధికారికంగా ఉపయోగించకుండా నిరోధించి, నిజమైన ఉత్పత్తిదారుడికి మాత్రమే ప్రయోజనం చేకూరేలా చేస్తుందని తెలిపారు. అందుకే, ఈ చేమదుంపకు అవసరమైన పత్రాలను సిద్ధం చేయడానికి, డాక్యుమెంటేషన్‌ను పూర్తి చేయడానికి ఆర్థికంగా మద్దతు ఇచ్చామని తెలిపారు.సజ్జాపూర్ చామదుంప అనేది ఒక ప్రాంతానికి ప్రత్యేకమైన చేమదుంప రకం. ఇది చూడటానికి ఆకర్షణీయంగా ఉండే దుంపలు, శ్రేష్ఠమైన వంట గుణం, మరియు లోతైన సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగి ఉంటుంది. ఈ రకం ముఖ్య లక్షణం దుంప పై తొక్కపై ఊదా రంగు చారలు లేదా మచ్చలు ఉండటం. వాణిజ్య రకాల్లో అరుదుగా కనిపించే ఈ లక్షణం, సజ్జాపూర్ గ్రామంలోని నల్లరేగడి నేలల్లోని ప్రత్యేకమైన ఖనిజ కూర్పు వల్ల ఏర్పడుతుందని నమ్ముతారు. ఈ దుంపలలో పొడి పదార్థం అధికంగా ఉంటుంది, దీనివల్ల వండినప్పుడు మెత్తగా, అంటుకోకుండా ఉంటాయి. వీటిలో వగరు కూడా తక్కువగా ఉండటం వల్ల, వీటిని ఎక్కువగా శుద్ధి చేయకుండానే తినవచ్చు.ఈ లక్షణాన్నివినియోగదారులు, చెఫ్‌లు ఇద్దరూ ఎంతో విలువైనదిగా భావిస్తారు. సంకర లేదా ఇతర ప్రాంతాల నుండి వచ్చిన రకాలలా కాకుండా, సజ్జాపూర్ చామదుంపను స్థానిక రైతులు ఒక శతాబ్దానికి పైగా సాంప్రదాయ శాస్త్రీయ పద్ధతుల ద్వారా సంరక్షించి, వ్యాప్తి చేస్తున్నారు. ఈ పంటను వర్షాధార , చెరువు నీటిపారుదల పద్ధతుల కింద పండిస్తారు. ఇది కోహిర్ మండలం అర్ధశుష్క వాతావరణానికి అనుగుణంగా ఉండి, దేశీయ పంటల వ్యవస్థలలో కలిసిపోయింది.



# నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

**అభ్యర్థులు హాల్ టికెట్ లోని సూచనలను పక్కాగా పాటించాలి.**

**సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి.**

**సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28 (నమస్తే ఉదయం)**

నీట్ పరీక్షను ఎలాంటి చిన్న తప్పిదం కూడా లేకుండా జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.మే 3వ తేదీన నిర్వహించనున్న నీట్ పరీక్షకు సంబంధించి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 936 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో నీట్ నిర్వహించే నాలుగు పరీక్ష కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, గతేడాది మాదిరే పరీక్షలను సజావుగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ లోనీ నిబంధనలను పూర్తిగా అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా పరీక్ష రాసేందుకు రావాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి విధిగా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రతి కేంద్రంలో సిఎస్, అబ్జర్వర్లు, ఇతర సిబ్బందితోపాటు తహసిల్దార్ స్థాయి అధికారులు, ఎస్సై, ఒక గన్మెన్, నలుగురు కానిస్టేబుల్స్ తో కూడిన పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో ఆపరేషన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, తదితర అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ తరఫున సకాలంలో బస్సులను నడపాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులకై అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రాథమిక వైద్యం, అంబులెన్స్, ఫైర్ వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు, నీట్ సిటీ కోఆర్డినేటర్ దేవేందర్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మార్లబీడులో వ్యక్తి ఆత్మహత్య

**మృతిపై కుటుంబ సభ్యుల అనుమానం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**

ధరూర్ మండలం మార్లబీడు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున వ్యవసాయ పొలం వద్ద ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. మార్లబీడు గ్రామానికి చెందిన కుర్వ నర్సింహులు(38) అనే వ్యక్తి తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ధరూర్ ఎస్ఐ నందీకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, నర్సింహులు మృతిపై ఆయన కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నర్సింహులది ఆత్మహత్య కాదని, హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల అనుమానాల నేపథ్యంలో, పోలీసులు క్లూస్ టీం మరియు డాగ్ స్క్వాడ్ బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# గద్వాల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**



ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులు రూపొందించిన రెండు స్టడీ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. మీనాక్షి మార్గదర్శకత్వంలో, అధ్యాపకులు బి. జగన్ మోహన్, పి. సురేష్ బాబు ల పర్యవేక్షణలో గణితశాస్త్రం, ఆర్థికశాస్త్రం విభాగాలకు చెందిన జిగ్నాసా విద్యార్థులు ఈ ప్రాజెక్టులను రూపొందించారు.ఈ ప్రాజెక్టుల్లో గద్వాల్ సిల్క్ సారీస్‌పై సమగ్ర అధ్యయనం మరియు వెంకంపేటలో ఎరువుల వాడకం వల్ల భూసారంలో చోటుచేసుకునే మార్పులపై గణిత విశ్లేషణ ప్రధాన అంశాలుగా ఉన్నాయి.ఈ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ వారు అధికారికంగా ధృవీకరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎ. మీనాక్షి అధ్యాపకులతో కలిసి విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733